సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



ప్రకృతి ప్రకోపం
జిల్లాలో ఆదివారం, సోమవారం ఈదురు గాలులు, అకాల వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. అరటి, మామిడి తదితరాలకు నష్టం వాటిల్లింది. - 8లో



ప్యాసింజర్ రైళ్లు తాత్కాలిక రద్దు
తిరుపతి నుంచి పాకాల, ధర్మవరం మీదుగా గుంతకల్, కదిరిదేవరపల్లి వరకు నడిచే ప్యాసింజర్ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.143
రెండోరకం	రూ.80	రూ.100



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 182 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	460	460
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు : 28.160 కిలోలు

న్యూస్‌రీల్

కార్మిక కుటుంబంలో విద్యాకుసుమం



శివశంకర్

రామాపురం : పారిశుద్ధ్య కార్మిక కుటుంబంలో విద్యాకుసుమం వికసించింది. మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ ఎగువదళితవాడకు చెందిన పూతోక రవణమ్మ, గంగులయ్య దంపతుల కుమారుతు శివశంకర్ ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో 973/1000 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. రవణమ్మ రాయచోటి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలుగా పని చేస్తోంది. తన కుమారుడిని చదివించుకోవాలనే లక్ష్యంతో రాయచోటి పట్టణంలోని ప్రతిభ జూనియర్ కాలేజీలో చేర్పించింది. తమ కష్టాలు కుమారుడికి గుర్తుకు రానివ్వకుండా చదివించింది. తల్లిదండ్రుల ఆశయానికి తగ్గట్టుగా శివశంకర్ కష్టపడి చదివి అత్యుత్తమ మార్కులు సాధించి, అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు.

ఉచితంగా ఇంటర్ విద్యకు అవకాశం

రాయచోటి టౌన్ : అర్హత కలిగి ఉండి ప్రతిభావంతులైన బాలికలకు కడప ఆర్తి హోం ఉచితంగా ఇంటర్ విద్యను అందిస్తున్నట్లు ఆ సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ పీవీ సంధ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరాశ్రయులుగా ఉన్న బాలికలకు తమ సంస్థ ద్వారా ఉచితంగా కార్పొరేట్ స్థాయి ఇంటర్ విద్యను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. అర్హత కలిగిన వారు ఆర్తి స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు 8074717196/8331951098/8106123469 లకు ఫోన్ చేయాలని కోరారు. 10వ తరగతి పూర్తి చేసి, ఆర్థికంగా వెనుకబడిన, నిరుపేద, తల్లిదండ్రులు లేని వారు అర్హులని పేర్కొన్నారు. ఉచిత వసతి, కెరీర్ మార్గదర్శనం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 24న సామర్థ్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు.

వీరభద్రుడికి పల్లకీ సేవ



పల్లకీపై శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఊరేగింపు

రాయచోటి టౌన్ : రాయచోటిలో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో విహరించారు. సోమవారం రాత్రి మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించి, పల్లకీలో కొలువు దీర్చారు. ఆలయ ప్రాంగణం, మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు చేపట్టారు. స్థానిక భక్తులతోపాటు ఇతర రాష్ట్రాల భక్తులు కూడా పాల్గొన్నారు.

16,17 తేదీల్లో పరీక్ష

రాయచోటి అర్బన్ : రాయచోటి డైట్ (జిల్లా విద్యాశిక్షణా సంస్థ)లో అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హత కలిగిన ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై నియమించేందుకు ఉద్దేశించిన పరీక్షలు ఈ నెల 16,17 తేదీలలో నిర్వహించనున్నట్లు రాయచోటి డైట్ ప్రిన్సిపల్ అజయ్‌కుమార్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రంలో హాజరు కావాలన్నారు. తమ వెంట దరఖాస్తు ప్రతులు, గుర్తింపు కార్డులను తీసుకురావాలని కోరారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్‌లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు పరీక్షకు హాజరు కావాలన్నారు.

జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాల నివారణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులు

రాయచోటి టౌన్ : ముందు జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలను నివారించుకోవచ్చని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మాసాపేట వద్ద అగ్నిమాపక వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే విషయాలను తెలిపే కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్ రావు, అగ్నిమాపక శాఖ అధికారులు పి.అనిల్‌కుమార్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతం.. చక్రస్నానం

- కమనీయంగా కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు
- వేడుకగా స్నపనతిరుమంజనం
- పుష్కరిణిలో భక్తుల పుణ్యస్నానాలు





ఒంటిమిట్ట పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) స్వాముల వారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఏకశిలానగరి కోదండ రాముడి బ్రహ్మోత్సవాల్లో చివరి అంకం చక్రస్నానం. తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు యజ్ఞంలా జరిగాయి. లక్షలాది మంది భక్తులు తరలివచ్చి జగదభిరామున్ని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల ముగింపు దశలో కీలకమైన చక్రస్నానాన్ని సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో సోమవారం ఉదయం సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం భక్తుల సర్వదర్శనానికి అనుమతిచ్చారు. సీతారామలక్ష్మణ దివ్య మూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. 9:30 గంటలకు సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకీలో.. ఆలయం ఎదురుగా నిర్మించిన నూతన పుష్కరిణికి శోభాయాత్ర ప్రారంభమైంది. మార్గంమధ్యలో కోలాట నృత్యాలు, కేరళ వాయిద్యాలతో సందడి నెలకొంది. 09:30 నుంచి 10:30 గంటల వరకు సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులకు ఉత్సవ కంకణదారు రాజేష్ ఆధ్వర్యంలో స్నపనతిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణుల సరసన చక్రత్తాళ్వార్‌కు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనాలతో అభిషేకాలు చేశారు. 10:30 నుంచి 11:00 గంటల వరకు అర్చకులు వేద మంత్రోచ్చారణతో చక్రస్నాన కార్యక్రమాన్ని కమనీయంగా నిర్వహించారు. టీటీడీ అధికారులు, ఉద్యోగులు సిబ్బంది, కళాకారులు, భక్తులు పుణ్యస్నానాలు చేశారు. పుష్కరిణి నుంచి ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. ఇంటి ఇలవేల్పు ముంగిట్లోకి రావడంతో.. భక్తులు కాయా, కర్పూరం సమర్పించి హారతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఇది ప్రత్యేకత : కోదండ రాముడి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా చక్రస్నానం ప్రత్యేక ఆకర్షణ. మహా విష్ణువు ధరించిన ఆయుధం చక్రస్నానం. శత్రువు సంహారానికి విష్ణువు చక్రాయుధాన్ని వినియోగిస్తారు. సంహారం ముగిసిన తరువాత అది తిరిగి స్వామివారి చేతిని అలంకరిస్తుంది. ఆ చక్రమే త్రేతాయుగంలో రామబాణంగా అవతరించింది. సీతాదేవికి దప్పికగా ఉన్నప్పుడు ఈ చక్రమే రామబాణంగా.. భూమి పొరల్లోకి వెళ్లి గంగను బయటకు తెచ్చింది. అటువంటి రామబాణంగా కీర్తిస్తున్న చక్రానికి చక్రస్నానం నిర్వహించడం ప్రత్యేకత.





సీతారామలక్ష్మణ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేద పండితులు, వేడుకను తిలకిస్తున్న భక్తులు



ఆకట్టుకున్న మహిళల కోలాటం

మహనీయుడు అంబేడ్కర్

- జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్
- ఘనంగా బాబా సాహెబ్ జయంతి




అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న జేసీ, జిల్లా అధికారులు

రాయచోటి : న్యాయవాదిగా, సామాజిక సంస్కర్తగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ తెలిపారు. రాయచోటి మాసాపేటలోని సాయిశుభ కల్యాణ మండపంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో సోమవారం భారతరత్న అంబేడ్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు మాండవ్యనది బ్రిడ్జి పైన ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ మధుసూదన్‌రావు, ఎంఆర్‌పీఎస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి మాత్రమే కాదని, ఆయన ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. అంబేడ్కర్ ఒక గొప్ప రచయిత, అనర్గళంగా మాట్లాడగలిగే ఒక వక్త, ఒక తత్వవేత్త, స్త్రీల హక్కుల కోసం పోరాడిన సంస్కర్త అని అన్నారు. అనంతరం డీఆర్ఓ మధుసూదన్‌రావు మాట్లాడుతూ కుల వివక్ష పూర్తిగా పోలేదని, దానిని రూపుమాపేందుకు అందరం కృషి చేయాలన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు నరేంద్రబాబు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలు అభివృద్ధి చెందాయి అంటే దానికి కారణం అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జయప్రకాష్, భారతీయ అంబేడ్కర్ సేన నాయకుడు పల్లం తాతయ్య, డీవీఎంసీ సభ్యుడు శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, ఎంఆర్‌పీఎస్ నాయకులు, భారతీయ అంబేడ్కర్ సేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర పతనం.. రైతుకు శోకం

- పడిపోయిన వంకాయల రేట్లు
- పెట్టుబడి కూడా దక్కని వైనం
- అప్పుల పాలవుతున్న అన్నదాత





రాయచోటి సమీపంలో సాగు చేసిన వంగ తోట

రాయచోటి : ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలకు కనీసం గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతన్నలు వరుస నష్టాలు చవిచూస్తున్నారు. ఇంకా టమాటా రైతు కోలుకోలేని స్థితిలో ఉండగా.. మరోవైపు వంగ తోటలు సాగు చేసిన వారు నిలువునా మునిగిపోతున్నారు. మార్కెట్‌లో వంగ ధర పడిపోవడంతో రైతు కన్నీరు పెట్టుకుంటున్నారు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. గత రెండు నెలల వరకు గిరాకీ ఉండటంతో.. వంగ పంటను అధికంగా సాగు చేశారు. కాయలను కోసి మార్కెట్‌కు తరలించేందుకు రవాణా చార్జీలు 20 కిలోల ప్యాకెట్‌కు రూ.50 ఖర్చు అవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.3 నుంచి 4 మాత్రమే పలుకుతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. గత ఏడాది ఇదే సమయంలో రూ. 20 ఉండగా ఈ ఏడా రూ.3 నుంచి 4కు పడిపోయింది.

దోచుకుంటున్న వ్యాపారులు

జిల్లాలో సుమారు 500 ఎకరాల్లో వంగ సాగయ్యేది. ఈ ఏడాది వెయ్యి ఎకరాలకు పైగా సాగులోకి తెచ్చారు. చెన్నై, ఏలూరు, బెంగళూరు, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు రోజుకు 20 నుంచి 30 టన్నుల పంట రవాణా అవుతుండేది. ఆయా ప్రాంతాల్లో కూడా వంగ సాగు పెరగడంతో.. నేడు బయటి ప్రాంతాల మార్కెట్ రవాణా 50 శాతానికి తగ్గింది. దీనిని ఆసరాగా చేసుకొని స్థానిక వ్యాపారాలు దోచుకుంటున్నారు. రైతుల వద్ద నిల్వ చేసుకొనే సామర్థ్యం లేకపోవడంతో.. అడిగిన ధరకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంటపై చేసిన అప్పులు, వడ్డీలు ఎలా తీర్చాలో తెలియక లోలోపల కుమిలిపోతున్నారు.

వినియోగదారులకు..

కూరగాయల మార్కెట్, రైతు బజార్‌లో వినియోగదారులకు మాత్రం వంకాయలను రూ.10 నుంచి రూ.15లకు విక్రయిస్తున్నారు. లాభాన్ని దళారులు, వ్యాపారులు కలిసి ఆర్జిస్తున్నారు. నిల్వ చేసుకునే సామర్థ్యం, వినియోగదారులకు అమ్మే అనుకూలత వ్యాపారులకు ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. పంట సాగు చేసిన రైతులకు మాత్రం నష్టాలు తప్పడం లేదు.

రూ.4 లక్షలు పోయాయి



రాత్రి 12 గంటలకు మార్కెట్‌కు కాయలు తెస్తే కొనేవారు లేక మరుసటి రోజు కూడా కూర్చుంటున్నా.. 20 కిలోల ప్యాకెట్‌లు రూ.50, 60కు ఇవ్వగలవా అంటూ బేరాలు ఆడుతున్నారు. మళ్లీ, మళ్లీ ఆటోలకు రవాణా చార్జీలు ఇవ్వలేక అడిగిన ధరకు ఇచ్చేస్తున్నాం. 2.5 ఎకరాల భూమిని లక్ష రూపాయలతో కౌలుకు తీసుకొని వంగ తోట సాగు చేశాను. సాగు కోసం రూ.3 లక్షలు ఖర్చు చేసి పంట పండించాను. ఇప్పటికీ 80 శాతం పంట దిగుబడి వచ్చినా రూ.50 వేలు కూడా రావడం లేదు. మార్కెట్‌లో లభిస్తున్న ధరలను చూస్తే పూర్తిగా నష్టపోవాల్సి వస్తుంది. – సుబ్బారెడ్డి, రైతు, ఏపిలవంకపల్లి, రాయచోటి మండలం

దళారుల బారి నుంచి కాపాడాలి



రైతులు లక్షల రూపాయలు ఖర్చు చేసి, రాత్రింబవళ్లు నిద్రలేకుండా సాగు చేసిన పంటకు మార్కెట్‌లో దళారుల కారణంగా దారుణంగా నష్టపోతున్నారు. రాయచోటి, కడప లాంటి మార్కెట్‌లో అర్ధరాత్రి వేళ కూరగాయలు వేలం వేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు అక్కడున్న వ్యాపారులతో కుమ్మక్కై .. వారు నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేసి రైతులను ఇబ్బంది పెడుతున్నారు. ఇలాంటి దళారుల బారి నుంచి రైతులను కాపాడేందుకు అధికారులు ముందుకు రావాలి. – బాలకృష్ణారెడ్డి, రైతు సంఘం, రాయచోటి ఏరియా ప్రధాన కార్యదర్శి

ఒంటిమిట్టలో ఘోర రోడ్డు ప్రమాదం



స్కార్పియోలో విగతజీవులుగా పడి ఉన్న నంద్యాల యువకులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

- ముగ్గురు దుర్మరణం
- మృతులు నంద్యాల వాసులుగా గుర్తింపు
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కడప డీఎస్పీ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలంలోని కడప–చెన్నై జాతీయ రహదారి సోమవారం నెత్తురోడింది. ముగ్గురు నంద్యాల వాసులు మృత్యువాత పడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి నుంచి ఏపీ31 సీడబ్ల్యూ 7479 నంబర్ గల స్కార్పియో వాహనం నంద్యాలకు వెళ్తోంది. తిరుపతి నుంచి ఏపీ 39 యూఎం 9771 నంబర్ గల ఏపీఎస్ ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు వస్తోంది. ఈ రెండు వాహనాలు మార్గం మధ్యలోని ఒంటిమిట్ట మండల పరిధి నడింపల్లి వద్ద ఉన్న కడప–చెన్నై జాతీయ రహదారిపై ఢీకొన్నాయి. దీంతో స్కార్పియో పల్టీ కొట్టి ఎలక్ట్రిక్ బస్సు వెనుక వస్తున్న పెట్రోలింగ్ వాహనాన్ని కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కార్పియో వాహనంలో ఉన్న నలుగురిలో నంద్యాలలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఐటీఐ చేస్తున్న తేజ నాయుడు(21), నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం కొత్తపల్లికి చెందిన ధర్మారెడ్డి, నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం సోమయాజులపల్లికి చెందిన జనరేటర్ మెకానిక్ వినోద్(25) అనే ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. కర్నూలులో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నంద్యాలలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన నిజాం సునీల్ నాయుడుకు తీవ్ర గాయాలు అయ్యాయి. పెట్రోలింగ్ వాహనం నడుపుతున్న రఘురాంరెడ్డి, అనే కానిస్టేబుల్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న సీఐ బాబు, ఎస్ఐ శివప్రసాద్ రెడ్డి ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. గాయపడిన వారిని 108 సాయంతో కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదం జరిగిన సమాచారాన్ని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లుకు చేరవేయడంతో ఆయన సంఘటనా స్థలానికి వచ్చారు. మృతదేహాలను పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని కడప ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి, రాజంపేట డిపో డీఎం రమణయ్య, కడప డిపో ఇన్‌చార్జి డీఎం కన్యాకుమారి, అలిపిరి డిపో డీఎం హరికృష్ణ పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు.

ఘటనపై మంత్రి దిగ్భ్రాంతి

ఒంటిమిట్టలోని నడింపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మృతులకు సంతాపం తెలిపి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య అధికారులకు మంత్రి సూచించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు.

సంఘటనా స్థలాన్ని చూస్తే స్కార్పియోదే తప్పు..



రోడ్డు ప్రమాదానికి సంబంధించిన సంఘటనా స్థలాన్ని కడప ఆర్టీసీ ఆర్ఎం పి. గోపాల్‌రెడ్డి పరిశీలించారు. అక్కడ ఉన్న పరిస్థితిని చూస్తే స్కార్పియో వాహనం నడిపిన వారిదే తప్పుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఓవర్ స్పీడ్ మీద వచ్చి బస్సు మోటును కొట్టడంతో స్పీడ్ మీద తిరుగుకుంటూ వెళ్లి.. బస్సు వెనుక వైపు వస్తున్న పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టి ఉంటాడని తెలిపారు. పూర్తిగా తెలుసుకునేందుకు ఎలక్ట్రిక్ బస్సుకు ఉన్న సీసీ పుటేజీని పరిశీలిస్తామని చెప్పారు.

నంద్యాలలో విషాదం

నంద్యాల : నంద్యాల జిల్లాకు చెందిన ముగ్గురు మృత్యువాత పడటంతో ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది. మహానంది పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సునీల్‌నాయుడు తన పెదనాన్న కుమారుడు తేజనాయుడు, స్నేహితులు ధర్మారెడ్డి, వినోద్‌లతో కలిసి తన బాబాయ్ అయిన హరినాయుడు పని కోసం ఆదివారం తిరుపతికి వెళ్లారు. హరినాయుడును అక్కడే వదిలేసి సోమవారం స్కార్పియో వాహనంలో తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. కానిస్టేబుల్ సునీల్‌నాయుడుకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.

- చాగలమర్రి మండలం డి.కొత్తపల్లె గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి, అన్నమ్మల కుమారుడు ధర్మారెడ్డి నంద్యాలలోని జియో కంపెనీలో పని చేసేవాడు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తుంటారు. వీరికి ధర్మారెడ్డితోపాటు కూతురు జ్యోతి, మరో కుమారుడు శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



తేజ నాయుడు(ఫైల్)



వినోద్ (ఫైల్)

- బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లె గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ, వెంకటరాముడుల కుమారుడు వినోద్ టవర్ల వద్ద జనరేటర్ మెకానిక్‌గా పని చేసేవాడు.
- నంద్యాల పట్టణంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన భద్ర, రాజేశ్వరిల కుమారుడు తేజనాయుడు పట్టణంలోని ఓ కళాశాలలో ఐటీఐ చదువుతున్నాడు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు, బంధువులు హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

– జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని ఒంటిమిట్ట మండలం నడింపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందడంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన ఏఆర్ కానిస్టేబుల్‌కు దగ్గరుండి మెరుగైన వైద్యమందించాలని ఎస్పీ అశోక్ కుమార్‌ను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. నడింపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలవ్వడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడికక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్పీ అశోక్ కుమార్‌కు మంత్రి సవిత స్పష్టం చేశారు.

క్లుప్తంగా

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెద్దతిప్పసముద్రం : రోడ్డు పక్కన ఆగి ఉన్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మండలంలోని చిన్నపొంగుపల్లికి చెందిన చౌడప్ప (72) బస్సులో వెళ్లేందుకు టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లి క్రాస్ రోడ్డులో వేచి ఉన్నాడు. అదే సమయంలో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చి నిల బడి ఉన్న చౌడప్పను బలంగా ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సురేష్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిహర ప్రసాద్ తెలిపారు.

గుండెపోటుతో పాస్టర్..


పాస్టర్ మహర్షి బాబు (ఫైల్)

పీలేరు రూరల్ : మండలానికి చెందిన చర్చి పాస్టర్ గుండెపోటుతో మృతి చెందారు. చిత్తూరులోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేస్తూ చిత్తూరు జిల్లా పాకాలకు చెందిన నాంపల్లె బాబు అలియాస్ మహర్షిబాబు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు చర్చిలలో పాస్టర్‌గా పనిచేశారు. ఆదివారం ఉదయం పీలేరు–చిత్తూరు మార్గంలోని హెబ్రోను ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు వెళ్లారు. ప్రార్థనలు ముగిసిన అనంతరం గుండెలో నొప్పిగా ఉందని తెలిపిన కొంత సమయానికే ప్రార్థన మందిరంలోనే స్పృహతప్పి పడిపోయారు. గమనించిన సహచరులు వెంటనే సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పాస్టర్ మహర్షి బాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు..


మృతి చెందిన ఆదిలక్ష్మి

కలకడ : కలకడ మండలం, బాలయ్యగారిపల్లె పంచాయతీ, ఆర్వెంటిదిన్నె (దాసిరెడ్డిగారిపల్లె) కు చెందిన నాగసిద్దారెడ్డి భార్య ఆదిలక్ష్మి (85) మూడు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సోమవారం ఇంట్లోనుంచి దుర్వాసన రావడంతో గమనించిన స్థానికులు కలకడ పోలీసులకు సమాచారం అందించారు. కలకడ సీఐ గురునాథ ఇంటిని పరిశీలించి ఆదిలక్ష్మి శరీరంపై కాలిన గాయాలు, రక్తగాయాలు ఉండటంతో మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి కుమారుడు ద్వారకనాథరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రకృతి ప్రకోపం!

- పంట చేతికొచ్చే సమయంలో ప్రతిసారి ఎదురుదెబ్బలు
- రెండు రోజులుగా వాతావరణ మార్పులతో విపత్కర పరిస్థితులు
- పెనుగాలులతో రాచపల్లె, పందిళ్లపల్లె, కుర్నూతలలో నేలరాలిన మామిడి
- రాజంపేట, రైల్వేకోడూరులలో అరటికి దెబ్బ


ఓబులవారిపల్లె:గాదెల పరిసరాల్లో వీచిన గాలులకు నేలకొరిగిన అరటి చెట్లు

సాక్షి రాయచోటి : అన్నదాతపై ప్రకృతి ప్రతిసారి పగబడుతోంది. సీజన్ ఏదైనా అకాల వర్షాలు.. పెనుగాలులు.. వడగళ్ల వాన.. చలి మంచు.. వేడి సెగలు ఇలా ఏదో ఒక రూపంలో రైతన్నను ప్రకృతి కుదేలు చేస్తోంది. పంట పండి చేతికొచ్చే దశలో కోలుకోలేని దెబ్బతీస్తోంది. ప్రతిసారి రైతన్నపై ప్రకృతి పగబడుతుందా అన్నట్లు ఏదో ఒక రూపంలో దెబ్బతగులుతుండడం అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. మండు వేసవిలోభానుడు సెగలు కక్కుతున్న ప్రస్తుత తరుణంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం అన్నదాతకు శాపంగా మారింది. అన్నమయ్య జిల్లాలో ఆదివారం రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో అరటికి స్వల్ప నష్టం సంభవించగా, సోమవారం సాయంత్రం వీచిన పెనుగాలులు మామిడి రైతును దెబ్బతీశాయి.

మామిడి రైతుకు దెబ్బమీద దెబ్బ

జిల్లాలో మామిడి రైతుపై ప్రకృతి ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. ఇప్పటికే చలి, మంచు ప్రభావంతో సరిగా పూత, పిందె రాక అన్నదాతలు అల్లాడిపోయారు. అంతో ఇంతో అక్కడక్కడా పూత, పిందె వచ్చినా ఎక్కువ వేడి ప్రభావంతో అది కూడా చాలా వరకు రాలిపోయింది. కొన్ని గ్రామాల్లో ఎంతో కొంత దిగుబడి వస్తుందనుకున్న తరుణంలో గాలులు తీవ్రంగా దెబ్బతీశాయి. సోమవారం సాయంత్రం వీచిన గాలుల ధాటికి రామాపురం మండలం రాచపల్లె పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. సుమారు 3000–3500 ఎకరాల్లో కాయలు రాలిపోయి ఉంటాయని ప్రాథమికంగా రైతులు పేర్కొంటున్నారు. నేడో, రేపో కాయలు కోయాల్సిన పరిస్థితి నెలకొన్న తరుణంలో గాలులు దెబ్బతీశాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క లక్కిరెడ్డిపల్లె మండలంలోని కుర్నూతల, పందిళ్లపల్లె గ్రామాల్లో కూడా మొత్తం పొలాల్లోని మామిడి కాయలన్నీ నేల రాలినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. మంగళవారం పూర్తి స్థాయిలో పరిశీలిస్తే తప్ప ఎంత మొత్తంలో నష్టం జరిగిందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం వీచిన పెనుగాలుల ధాటికి రాజంపేట, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాల్లో సుమారు 30–40 ఎకరాల్లో అరటి పంటకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. ఏది ఏమైనా ప్రకృతి వైపరీత్యాల కారణంగా అన్నదాతకు దెబ్బమీద దెబ్బ తగులుతూనే ఉంది.

ఈదురు గాలులు, వడగండ్ల వర్షం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కుర్నూతల, పందిళ్లపల్లి గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షానికి ఈదురు గాలులు తోడు కావడంతో మామిడి రైతును కుదేలు చేశాయి. కుర్నూతల సర్పంచ్ రమణయ్య ఇంటిపై ఉన్న రేకులు గాలుల ధాటికి లేచిపోవడంతో ఇంట్లో బియ్యం బస్తాలతోపాటు వంట సామగ్రి పూర్తిగా తడిసి ముద్దయిపోయింది. పందిళ్లపల్లి గ్రామంలో మామిడి కాయలు గాలుల ధాటికి రాలిపోవడంతో మామిడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతి ఏడాది ఏప్రిల్ మాసంలో ఈదురు గాలులు, వడగండ్ల వర్షానికి మామిడి రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఉద్యానశాఖ అధికారులు తూతూ మంత్రంగా మామిడి కాయలు రాలిపోయిన రైతుల వివరాలు సేకరించడం తప్ప ఇప్పటి వరకు మామిడి రైతుకు ఒరిగిందేమీ లేదనే చెప్పాలి. ఈ ఏడాది మామిడి రైతు ఎకరాకు రూ. 2500లు ఇన్సూరెన్సు కోసం జమ చేశారు. ఇన్సూరెన్సు ద్వారా మేలు చేకూరుతుందో లేదో వేచి చూడాల్సిందే.


లక్కిరెడ్డిపల్లె మండలం కుర్నూతలలో లేచిపోయిన ఇంటిపై ఉన్న రేకులు


లక్కిరెడ్డిపల్లెలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం


పందిళ్లపల్లెలో నేలరాలిన మామిడి కాయలు

దెబ్బతిన్న అరటి తోటలు

ఓబులవారిపల్లె : ఆదివారం రాత్రి వీచిన గాలులకు అరటి తోటలు మండల వ్యాప్తంగా దెబ్బతిన్నాయి. పెద్దఓరంపాడు, రాళ్లచెరువుపల్లి పరిసరాల్లో దాదాపు 20 ఎకరాల్లో బలమైన గాలులకు అరటిచెట్లు నేలగొరిగాయి. కోతకు వచ్చిన అరటి చెట్లు పడిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. రాళ్లచెరువు పల్లి, గాదెల, పరిసర గ్రామాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయి. దాదాపు రూ.30 లక్షల పంట నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు చేస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి భాస్కర్ తెలిపారు.

రాములవారి ఊరేగింపులో యువకుడికి కత్తిపోట్లు


ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చేతన్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణం పగడాలపల్లిలో రామాలయానికి సంబంధించిన సీతారాములవారి గ్రామోత్సవంలో సోమవారం ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ జరిగింది. చిట్వేలి రోడ్డులో గ్రామోత్సవం జరుగుతుండగా స్థానికులైన కంబాల గౌరీ శంకర్, గోవింద్ చేతన్‌లు ఘర్షణకు దిగారు. దీంతో కంబాల గౌరీ శంకర్ గోవింద్ చేతన్‌పై కత్తితో దాడి చేశాడు. ఇందుకు పాత కక్షలే కారణమని పలువురు చెబుతున్నారు. హుటాహుటిన గాయపడిన వ్యక్తిని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై సీఐ హేమసుందర్ రావు విచారణ చేస్తున్నారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆటో చోరీ

కడప అర్బన్ : కడప చిన్నచౌకు పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకరాపురంలో పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురైంది. మాసాపేటకు చెందిన నాగభూషణం అనే వ్యక్తి శంకరాపురంలో తన బంధువుల ఇంటి వద్ద ఆదివారం రాత్రి ఆటోను పెట్టి అక్కడే పడుకున్నాడు. తెల్లవారేసరికి ఆటో కనిపించలేదు బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దార్శనికుడు బాబా సాహెబ్ అంబేద్కర్

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : సమాజంలో అంటరానితనం నిర్మూలనకు అక్షరమనే ఆయుధాన్ని ఎక్కుపెట్టిన దార్శనికుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం డాక్టర్ బాబా సాహెబ్ జయంతి సందర్భంగా అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నిరుపేద, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడన్నారు. రాబోయే తరాలకు కూడా మార్గదర్శకమని, ఆయనను గుర్తు చేసుకోవడం మనందరి బాధ్యత అన్నారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విధుల్లో పునరంకితం అవుదామని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి.రాజారమేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, ఎం.పెద్దయ్య, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని..

కలసపాడు : ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం ముండ్లపాడు వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని ఎగువ రామాపురం గ్రామానికి చెందిన షేక్‌ఖాదర్‌వలీ (62) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కార్పెంటర్ పని చేసుకుని జీవిస్తున్న ఖాదర్‌వలీ తన సొంత పని నిమిత్తం గిద్దలూరుకు వెళ్లి పని ముగించుకుని బైక్‌లో వస్తుండగా ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం ముండ్లపాడు పెట్రోలు బంకు వద్ద గిద్దలూరుకు వెళుతున్న యువకుల బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య బషిరున్, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం


మంగపట్నం పవన్ (ఫైల్)

జమ్మలమడుగు : మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన మంగపట్నం పవన్ అదృశ్యమైనట్లు మైలవరం ఎస్ఐ శ్యాంసుందర్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగపట్నం పవన్ జమ్మలమడుగు పట్టణంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ సీఈసీ చదువుతున్నాడు. అయితే ఈనెల 12వతేదీ మధ్యాహ్నం కాలేజీ ఫీజు కట్టేందుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లిపోయాడు. ఇంత వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో విద్యార్థి తండ్రి లింగమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరం రిమ్స్ ఆసుపత్రి సమీపంలో గత నెల 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యకిత రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. రిమ్స్ పోలీసుల కథనం మేరకు.. వీరపునాయునిపల్లి మండలం పాలగిరి గ్రామానికి చెందిన మల్లెం కొండ జగదీష్ (42) కడప జెడ్పీ ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌లో పని చేసేవాడు. అప్పులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై గత నెల 27న రిమ్స్ ఆసుపత్రి సమీపంలో పురుగుల మందు తాగాడు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో నిలుపుదల స్థలం కోసం ఘర్షణ

ఆరుగురికి తీవ్ర గాయాలు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మేకలబాలయపల్లి గ్రామంలో ఆటో నిలుపుదల చేసుకునే స్థలం విషయమై సాయిరాం, రమేష్‌ల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణ మరింత ముదిరి ఆదివారం అర్ధరాత్రి సాయిరాం ఇంటిపైకి రమేష్, సురేష్‌లతో పాటు మరికొంత మంది కలసి దాడి చేసి ఆరుగురిని తీవ్రంగా గాయపరిచారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేష్, సురేష్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు కలమల్ల పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మేకలబాలయపల్లి గ్రామానికి చెందిన సాయిరాం, రమేష్, సురేష్‌ల ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. అయితే వీరి మధ్య ఆటో నిలుపుదల స్థలంపై ఆదివారం ఘర్షణ జరిగింది. అయితే అర్ధరాత్రి రమేష్, సురేష్‌లతో పాటు మరి కొందరు కలసి కర్రలు తీసుకుని సాయిరాం ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో సాయిరాం, జయరాం, రామచంద్రుడు, రామదేవి, నాగవేణి, తేజ్‌రాంలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు రామచంద్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేష, సురేష్‌లతో పాటు మరి కొందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు కలమల్ల పోలీసులు తెలిపారు.

లారీలకు గ్రీన్ ట్యాక్స్ తగ్గించకుంటే సమ్మె చేస్తాం

ప్రొద్దుటూరు క్రైం : లారీలపై వేస్తున్న గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించకుంటే సమ్మె చేయడానికైనా వెనుకాడేది లేదని ఏపీ న్యూ ఆంధ్రా మోటార్, ట్రక్కర్స్ అసోసియేషన్ (నమ్‌తా) జనరల్ సెక్రటరి టీవీ చలపతి తెలిపారు. స్థానిక లింగాపురంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం లారీ ఓనర్లు, డ్రైవర్లకు రవాణా చట్టాలు, సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీరో ఆక్సిడెంట్ సమాజం కోసం అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలపై గతంలో అనేక మార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చామన్నారు. టోల్ ట్యాక్స్, ఇన్సూరెన్స్ ప్రీమియం, గ్రీన్ ట్యాక్స్ పేరుతో విపరీతంగా డబ్బు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ప్యాసింజర్ రైళ్లు తాత్కాలిక రద్దు

- రైలు ప్రయాణికులపై మరో పిడుగు
- పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు దారి మళ్లింపు
- ధర్మవరం రైల్వేస్టేషన్ ఆధునికీకరణతో అధికారుల నిర్ణయం



కలికిరి : తిరుపతి నుంచి పాకాల, ధర్మవరం మీదుగా గుంతకల్, కదిరిదేవరపల్లి వరకు నడిచే ప్యాసింజర్ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మవరం జంక్షన్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల కారణంగా 35 రోజుల పాటు ప్యాసింజర్ రైళ్లు రద్దు చేశారు. అలాగే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దుతో పాటు, కదిరి, మదనపల్లి రోడ్, పీలేరు, పాకాల మీదుగా నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారిమళ్లించారు.

వాటి వివరాలు ఇలా ఉన్నాయి

తిరుపతి – గుంతకల్ ప్యాసింజర్(57403) మే నెల 18వ తేదీ వరకు, గుంతకల్ – తిరుపతి ప్యాసింజర్(57404) మే నెల 19వ తేదీ వరకు, తిరుపతి – కదిరిదేవరపల్లి ప్యాసింజర్(57405) మే నెల 16వ తేదీ వరకు, కదిరిదేవరపల్లి – తిరుపతి ప్యాసింజర్(57406) మే నెల 17వ తేదీ వరకు రద్దయ్యాయి. అలాగే తిరుపతి–అమరావతి ఎక్స్‌ప్రెస్(12765) మే నెల 6, 10, 13, 17 తేదీలలో రద్దు చేశారు. అమరావతి–తిరుపతి ఎక్స్‌ప్రెస్ (12766) మే నెల 5, 8, 12, 15 తేదీలలో రద్దు చేశారు.

దారి మళ్లింపు ఇలా..

తిరుపతి–అకోలా వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్(07605) పాకాల, పీలేరు, ధర్మవరం మీదుగా కాకుండా మే నెల 9, 16 తేదీలో తిరుపతి నుంచి రేణిగుంట, గుత్తి మీదుగా దారి మళ్లించారు. అకోలా–తిరుపతి వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్(07606) ధర్మవరం, కదిరి, పీలేరు, పాకాల మీదుగా కాకుండా మే నెల 4, 11 తేదీలలో గుత్తి, రేణిగుంట మీదుగా తిరుపతికి దారి మళ్లించారు. తిరుపతి–సికింద్రాబాద్ సెవెన్ హిల్స్(12769) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను మే నెల 5, 9, 12, 16 తేదీలలో పాకాల, పీలేరు, కలికిరి, కదిరి, ధర్మవరం మీదుగా కాకుండా తిరుపతి నుంచి రేణిగుంట, కడప, గుత్తి మీదుగా, అలాగే సికింద్రాబాద్–తిరుపతి సెవెన్‌హిల్స్(12770) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను మే నెల 6, 9, 13, 16 తేదీలలో గుత్తి నుంచి కడప, రేణిగుంట మీదుగా తిరుపతి రూట్‌కు మార్చారు. పాకాల, కలికిరి, కదిరి మీదుగా నడిచే తిరుపతి–సికింద్రాబాద్(12731) సూపర్ ఫాస్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ను మే నెల 8, 11, 15 తేదీలలో తిరుపతి నుంచి రేణిగుంట, కడప, గుత్తి మీదుగానూ, ధర్మవరం నుంచి కదిరి, కలికిరి, పీలేరు మీదుగా నడిచే సికింద్రాబాద్–తిరుపతి(12732) సూపర్ ఫాస్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ను మే నెల 7, 10, 14 తేదీలలో గుత్తి, కడప, రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుకుంటుంది. పాకాల, పీలేరు, మదనపల్లి రోడ్ కదిరి మీదుగా నడిచే మధురై–కాచిగూడ(07192) స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ మే నెల 5, 12 తేదీలలో గుత్తి, కడప, రేణిగుంట, తిరుపతి, పాకాల మీదుగానూ, కాచిగూడ–మధురై(07191)స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ మే నెల 7, 14 తేదీలలో పాకాల నుంచి తిరుపతి, రేణిగుంట, కడప, గుత్తి మీదుగానూ దారి మళ్లించారు. పాకాల, పీలేరు, ధర్మవరం మీదుగా నడిచే నాగర్‌కోయిల్–ముంబై(16340) ఎక్స్‌ప్రెస్‌ను మే నెల 5, 6, 7, 9, 12, 13, 14, 16 తేదీలలో పాకాల నుంచి తిరుపతి, రేణిగుంట, కడప, గుత్తి మీదుగా, ముంబై–నాగర్‌కోయిల్(16339)ఎక్స్‌ప్రెస్‌ను మే నెల 6, 7, 8,10,13, 14, 15 తేదీలలో గుత్తి నుంచి కడప, రేణిగుంట, తిరుపతి, పాకాల మీదుగా మళ్లించారు. మధురై–కాచిగూడ(22716) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను మే నెల 04, 11 తేదీలో పాకాల నుంచి తిరుపతి, రేణిగుంట, డోన్, గుత్తి మీదుగానూ, కాచిగూడ–మధురై(22715) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను మే నెల 10, 17 తేదీలలో డోన్, రేణిగుంట, తిరుపతి, పాకాల మీదుగా దారి మళ్లించారు. ధర్మవరం నుంచి రోజు నడిచే ధర్మవరం–నరసాపూర్(17248) ఎక్స్‌ప్రెస్ బుధవారం నుంచి కదిరి నుంచి మాత్రమే ప్రారంభమవుతుంది. అలాగే నరసాపూర్–ధర్మవరం(17247) ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం నుంచి కదిరి వరకు మాత్రమే నడపనున్నారు. ఈ మేరకు ప్రయాణికులు గమనించాలని అధికారులు కోరారు. కాగా గత ఏడాది డిసెంబరు 28 నుంచి మహాకుంభమేళా కోసం గుంతకల్–తిరుపతి ప్యాసింజర్ రైళ్లను సుమారు రెండు నెలలకు పైగా రద్దు చేసిన విషయం తెలిసిందే. మళ్లీ ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 1 నుంచి ప్రారంభించారు. ఇప్పుడు ధర్మవరం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ కోసం నెల రోజులకు పైగా ప్యాసింజర్ రైళ్లను పూర్తిగా రద్దు చేయడంతో రైల్వే ప్రయాణికులపై మరో పిడుగు పడ్డట్లైంది.

వైద్య ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ పద్ధతి తొలగించాలి


మాట్లాడుతున్న పబ్లిక్‌హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఆస్కార్‌రావు

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో వైద్య, ఆరోగ్యశాఖలో క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజ్‌డ్ అటెండెన్స్ సిస్టం) పద్ధతిని తొలగించాలని పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ – 3194 రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆ సంస్థ కార్యాలయంలో జిల్లా స్థాయి ఉద్యోగుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ విధానం తీసివేయాలన్నారు. సరైన నెట్‌వర్క్ లేని కారణంగా మారుమూల గ్రామాల్లో పనిచేస్తున్న సమయంలో ఉద్యోగులు ఎఫ్ఆర్ఎస్ ద్వారా అటెండెన్స్‌ను నమోదు చేయలేరన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై. శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి మహబూబ్‌బాషా, జోనల్ ఉపాధ్యక్షుడు సుధాకర్ రాజు, జాయింట్ సెక్రటరీ రాఘవ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు నాయక్, లక్ష్మినారాయణతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

రాయచోటి తాలూకా కార్యవర్గం..

రాయచోటి తాలుకా యూనియన్ అధ్యక్షుడిగా సుదర్శనరాజు, ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ, శివనాయక్, సదాశివరెడ్డి, శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా నూర్జహాన్, ఖదీర్, రాజేంద్ర, కోశాధికారిగా మహబూబ్‌బాషా, సెక్రటరీలుగా ప్రమీల, ధర్మారెడ్డి, రాజసులోచనలను ఎన్నుకున్నారు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వెంకట్రామిరెడ్డి, వెంకటయ్య, రెడ్డెమ్మ, భాగ్యలను ఎంపిక చేశారు.

వడగండ్ల వాన

సింహాద్రిపురం : మండలంలోని అహోబిలం గ్రామంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. అలాగే నక్కలపల్లె, బలపనూరు, అంకాలమ్మ గూడూరు గ్రామాల్లో కూడా వర్షం కురిసింది. వర్షానికి అహోబిలం గ్రామంలోని రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి శివశంకర్‌రెడ్డి ఇంటి వద్ద ఉన్న 50 ఏళ్ల వేపచెట్టు నేల కూలింది. గ్రామంలో కొన్ని చోట్ల భారీ ఈదురుగాలులకు అరటి చెట్లు నేలకొరిగాయి. కొన్ని గ్రామాల్లో చినుకు జాడే లేదు.


బలపనూరులో కురుస్తున్న వర్షం


అహోబిలంలో నేలకూలిన వేప చెట్టు

ఈదురు గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న


ఈదురు గాలులకు నేలవాలిన మొక్కజొన్న

కొండాపురం : మండలంలో వెంకయ్యకాలువ, బ్రాహ్మణపల్లె తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులకు మొక్కజొన్న కోత దశలో నేలకొరిగింది. దీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం వరకు భగభగలాడిన సూర్యుడు సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీయడంతోపాటు చిరుజల్లులు కురిశాయి. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మొక్కజొన్న పంట కోత దశలో నేల వాలడంతో కోత మిషన్ ఆడించేందుకు వీలులేకుండా పోతోందన్నారు. దీంతో కూలీల ఖర్చులు పెరిగి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పట్లలో పిడుగు పాటు


టెంకాయ చెట్టుపై పిడుగు పడిన దృశ్యం

లింగాల : లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలోని వరదరాజులరెడ్డి ఇంటి ఆవరణంలో ఉన్న టెంకాయ చెట్టుపై సోమవారం సాయంత్రం పిడుగు పడింది. పిడుగు పాటుకు టెంకాయ చెట్టు కాలిపోయింది. ఆ నిప్పు రవ్వలు సమీపంలో అరటి పంటకు వ్యాపించడంతో గ్రామస్తులు అప్రమత్తమై మంటలను అదుపు చేశా రు. పిడుగు పాటుతో ఎవరికి ఎలాంటి ప్రమా దం సంభవించలేదని గ్రామస్తులు తెలిపారు.